సాక్షి
హనుమకొండ
మంగళవారం | 25 | ఏప్రిల్ | 2023



క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నిందితులను మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸



బయోమెట్రిక్ షురూ..

కాకతీయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న అన్ని బోధనాస్పత్రుల్లో బయోమెట్రిక్ హాజరు అమలులోకి వచ్చింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.5°/24.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ స్పోర్ట్స్: క్రీడా శిక్షణ శిబిరాలకు మంగళవారంతో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందని డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా ప్రాధికార సంస్థ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు పట్టణ ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాలబాలికలు వివిధ క్రీడల్లో శిక్షణ కోసం దరఖాస్తు లు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు ఈనెల 25న సాయంత్రం 5 గంటల్లోపు హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ ఆఫీసులో దరఖాస్తులు సమర్పించాలని డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

27నుంచి ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: ఈనెల 27 నుంచి ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక సోమవారం తెలిపారు. ఈనెల 27, 29, మే1, 3వ తేదీల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

శేఖర్‌బాబు సేవలు మరువలేనివి



హన్మకొండ కల్చరల్: నాటక రంగానికి పందిళ్ల శేఖర్‌బాబు చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, జిల్లా రంగస్థల పద్యనాటక కళాకారులు పందిళ్ల శేఖర్‌బాబు 8వ వర్ధంతి సందర్భంగా జిల్లా రంగస్థల కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వేణుమాధవ్ కళాప్రాంగణంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శేఖర్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు కళాకారులు శేఖర్‌బాబుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు వనం లక్ష్మీకాంతారావు, ప్రచార కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, శ్రీధరస్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

28నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి మూడేళ్ల లా కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 28, మే 3, 6, 10, 13 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. పూర్తి వివరాలు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

రేపు జిల్లా పంచాయత్ ప్రణాళిక కమిటీ సమావేశం

హన్మకొండ: హనుమకొండ జిల్లా పంచాయత్ ప్రణాళిక కమిటీ సమావేశాన్ని ఈనెల 26న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు వరంగల్ అర్బన్ జెడ్పీ సీఈఓ, సభ్య కార్యదర్శి వెంకటేశ్వర్ రావు తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయత్ ప్రణాళికపై చర్చించి ఆమోదించనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, సభ్యులైన సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు స్పౌజ్ టీచర్ల ర్యాలీ

విద్యారణ్యపురి: ఉమ్మడి జిల్లాకు చెందిన స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్పౌజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10గంటలకు హనుమకొండలో ర్యాలీ నిర్వహించనున్నారు. హనుమకొండ డీఈఓ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నారు. 317 జీఓ ద్వారా భర్త ఒక జిల్లాలో భార్య మరో జిల్లాకు కేటాయించడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చేపట్టిన ఆందోళనలతో కొన్నినెలల క్రితం కొందరు స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన స్పౌజ్ టీచర్లను బదిలీలు చేపట్టినప్పటికీ మరికొందరికి చేపట్టలేదు. అదేవిధంగా ఎస్జీటీ స్పౌజ్‌లకు అసలే బదిలీలు చేపట్టలేదు. దీంతో మళ్లీ ఆందోళనబాట పట్టారు.

వీఆర్ఏ కాలర్ పట్టి నిలదీసిన రైతులు

- అనర్హులకు పరిహారం అందించారని ఆగ్రహం
- పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన

నడికూడ: అనర్హులకు వడగళ్ల నష్టపరిహారం చెక్కులు అందించారని రైతులు ఓ వీఆర్ఏ గల్లా పట్టారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలం చర్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గతేడాది వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహార చెక్కులను సోమవారం నర్సక్కపెల్లి, ముస్త్యాలపల్లి, చర్లపల్లి గ్రామాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. చర్లపల్లిలో చెక్కులు అందిస్తుండగా.. పలువురు రైతులు లేచి అనర్హులకు పంట పరిహారం మంజూరు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి, వీఆర్ఏ భిక్షపతితో కలిసి పంట నష్ట సర్వేలో తప్పుడు నివేదికతో అనర్హలకు పంట నష్ట పరిహారం మంజూరు చేయించారని ఆరోపించారు. విష్ణువర్ధన్ రెడ్డి, వీఆర్ఏ భిక్షపతిని నిలదీశారు. ఆవేశంతో రైతులు వీఆర్ఏ కాలర్ పట్టుకుని లాగడంతో, ఒక్కసారి ఘర్షణ వాతావరణం ఏర్పడింది. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు రైతులకు నచ్చి చెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు గ్రామపంచాయతీ ఎదుట నిరసన చేపట్టారు.



గ్రామ పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, (ఇన్‌సెట్‌లో) వీఆర్ఏ కాలర్ పట్టుకుని లాగుతున్న రైతులు

ఇళ్ల ఎదుటే సిట్టింగ్!



- హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్‌జీఓస్ కాలనీకి వెళ్లే దారిలో ఓ వైన్స్‌వద్ద పరిస్థితి ఇది.. పక్కనే మూడు కూడళ్ల చౌరస్తా.. ఓ కీలక ప్రజాప్రతినిధి ఇంటికి, క్యాంపు కార్యాలయానికి సమీపం. అక్కడ ఉన్న వైన్సు నుంచి మందు ఖరీదు చేసి రోడ్ల మీద, సమీపంలోని ఆర్టీసీ బస్‌పాస్ సెక్షన్, కౌంటర్ గది ఆవరణ ఇలా మందుబాబులకు నిలయంగా మారింది.



- ఇది హనుమకొండ ఫారెస్ట్ కార్యాలయం ఎదుట కాలనీ సమీపంలో సోమవారం రాత్రి సమయంలో తీసిన ఫొటో. మందుబాబులు షాపులో మద్యం కొనుగోలు చేసి పర్మిట్‌రూమ్‌ను వదిలేసి ఇలా కాలనీలో రోడ్ల మీద తాగి సీసాలు వదిలేస్తున్నారు. వైన్స్ పక్కనే తలుపులు మూసి ఉన్న ఇళ్ల ఎదుట బైక్‌లపై మద్యం సేవిస్తున్నారు.

సుక్కేసుకుంటున్నారు.. చుక్కలు చూపెడుతున్నారు

- పర్మిట్ రూములున్నా.. కాలనీల వీధుల్లో సిట్టింగ్‌లు
- గ్రేటర్ వరంగల్‌లో ఇష్టారాజ్యంగా మద్యం షాపుల నిర్వహణ
- రోడ్ల పక్కనే మందుబాబుల భైఠాయింపు.. వద్దంటే జగడం
- కలెక్టరేట్, కమిషనరేట్ గ్రీవెన్స్‌లో వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- మద్యం అమ్మకాలపై మహానగరంలో కానరాని పర్యవేక్షణ



హనుమకొండ ఫారెస్ట్ కార్యాలయం ఎదుట కాలనీ సమీపంలో రోడ్డుపైనే సిట్టింగ్ వేసిన మందుబాబులు

సాక్షిప్రతినిధి, వరంగల్:

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా పర్మిట్ గదులు ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు అనుమతిచ్చారు. కానీ.. చాలా చోట్ల నిబంధనలు పాటించడం లేదు. రోడ్లు, వీధుల ఇళ్ల ముందు మందుబాబులు సిట్టింగ్‌లు వేస్తున్నారు. నియమాలు ఉల్లంఘిస్తున్నారని తెలిసినా.. ఎక్సైజ్, పోలీసు అధికారులూ నోరు మెదపడం లేదు. ఆకర్షణీయ నగరంతోపాటు అన్ని రకాల అభివృద్ధిలో దూసుకెళ్తున్న గ్రేటర్ వరంగల్‌లో ఈ తంతు నిరాటంకంగా జరుగుతూనే ఉంది. మసక చీకటి మొదలు.. కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకు బాహాటంగానే వైన్స్‌ల పక్కన మందుబాబుల హడావుడి ఎక్కువవుతోంది. దీంతో హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రైసిటీస్‌కు చెందిన పలువురు కాలనీవాసులు కలెక్టర్, పోలీస్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నారు.

పేరుకే పర్మిట్ రూములు..

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 117 వైన్స్‌షాపు (ఏ4)లు, 95 బార్లు, 18 ఎలైట్ బార్లు ఉన్నారు. గ్రేటర్ వరంగల్ ట్రైసిటీస్ వరకు చూస్తే సుమారుగా 70 వరకు ఏ4 షాపులు, 90 వరకు బార్లు, ఎలైట్ బార్లున్నట్లు అధికారులు చెబుతున్నారు. మద్యం దుకాణాల నిబంధనల ప్రకారం.. దాదాపుగా అన్ని వైన్స్‌లకు పర్మిట్‌గదులను ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసిన మద్యాన్ని ఈ గదుల్లోకి వెళ్లి సేవించి వెళ్లిపోవాలి. కానీ.. చాలా దుకాణాల వద్ద విరుద్ధమైన పరిస్థితి ఉంది. కుర్చీలు వేసి వీటిని చిన్నతరహా బార్లుగా మార్చేస్తున్నారు. గంటల తరబడి అక్కడే ఉండడంతోపాటు సమీపంలో వీటి కోసమే చిరు వ్యాపారులు ఆహారం అందించేందుకు బండ్లు నెలకొల్పారు. బజ్జీలు, మిర్చీలు, గారెలు, చేప ఫ్రై, బోటి, నల్ల సహా ఇతరత్రా మందుబాబులకు అవసరమైన తినుపదార్థాలను అందిస్తున్నారు. మందుబాబులు వైన్స్‌లో మద్యం, బండ్లల్లో తిను పదార్థాలను ఖరీదు చేసి మెయిన్ సిటీ అయితే రోడ్ల పక్కన, కాలనీ సమీపంలోనైతే ఇళ్ల ఎదుటే సిట్టింగ్‌లు చేస్తున్నారు.

సుక్కేసి కాలనీవాసులు, సామాన్యప్రజలు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఏ ఒక్క ఎక్సైజ్, పోలీసు అధికారిగానీ అటువైపునకు వెళ్లి కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఇబ్బందులు అంతా ఇంతా కాదు..

వీధుల్లో ఉన్న ఈ మద్య దుకాణాల ముందు నుంచి భార్యాభర్తలు, ఒంటరిగా ఇళ్లకు మహిళలు రాత్రి 10 గంటల్లోపు వెళ్లడమనే విషయంలో భద్రత కొరవడుతోంది. రోడ్లపక్కన, పాదచారుల నడక ప్రదేశాల్లో కూర్చుని మద్యం సేవిస్తున్న వారిని ఎవరైనా అటకాయిస్తే పాపమవుతోంది. అక్కడ ఉన్న మందుబాబులంతా ఒక్కటై గొడవకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితి ట్రైసిటీలో సుమారు 38 ప్రాంతాల్లో ఉంది. ఇవే కారణాలతో రాత్రివేళల్లో గొడవలు, హత్యాయత్నాలు, హత్యలు జరిగిన ఘటనలు కూడా పోలీస్ రికార్డుల్లోకి ఎక్కాయి.

ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం చర్యలు

> వైన్‌షాపుల ఎదుట మద్యం సేవిస్తే పబ్లిక్ న్యూసెన్స్, ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. వైన్ షాపులకు కేటాయించిన పర్మిట్ రూముల్లో మాత్రమే మద్యం సేవించాలి. రోడ్ల పక్కన ఇబ్బంది కలిగించే వారితోపాటు ఆ అవకాశం కల్పిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.
>
> - చంద్రశేఖర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, హనుమకొండ

రైతులను ఆదుకోకపోతే ఉసురు తగులుతుంది

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మొక్కజొన్న చేను పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న ఈటల

కమలాపూర్: సీఎం కేసీఆర్.. పంజాబ్, హరియాణా, మహారాష్ట్ర రైతులను కాదు, ఓట్లేసి గెలిపించిన తెలంగాణ రైతులను కూడా ఆదుకోవాలని, లేదంటే వారి ఉసురు తగులుతుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. కమలాపూర్, అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, పెర్కపల్లి, నేరెళ్ల, గూడూరు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి తోటలు, మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం, ధ్వంసమైన ఇళ్లు, దళిత బంధు షెడ్లను సందర్శించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కమలాపూర్ మార్కెట్ యార్డులో మీడియాతో మాట్లాడారు. గతేడాది పంటలకు నష్టం వాటిల్లిందని, మిర్చి పంట నేలపాలైతే తాము వెళ్లి పరిశీలించి నష్ట పరిహారం డిమాండ్ చేస్తే మంత్రుల బృందం వచ్చి పోయింది తప్ప ఏడాదైనా రైతులకు ఒక్క రూపాయి రాలేదన్నారు. వరి కోతలు పూర్తవుతున్నా.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. సాధారణంగా రెండు నెలల ముందే సమీక్షలు చేసి కొనుగోళ్లు చేసేవారని, అన్నీ నాకే తెలుసన్నట్లు సీఎం కేసీఆర్ వ్యవహరిస్తూ రైతులను ఆగం చేస్తున్నాడన్నారు. వడగళ్లతో నష్టపోయిన మామిడికి ఎకరాకు రూ.లక్ష, మొక్కజొన్న పంట ఎకరాకు రూ.40వేలు, వరి ఎకరాకు రూ.30వేలు చొప్పున పంట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏం జరుగుతుందో పంజాబ్, మహారాష్ట్ర రైతులకు తెలియదని, ఇక్కడికి వచ్చి చూస్తే ఇక్కడి రైతులు ఎలా నష్టపోతున్నారో, వారిబాధ ఏంటో తెలుస్తుందన్నారు. రైతుబంధు ఇస్తానని వారిని కూడా సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నాడని, ఆయన మోసపు మాటలు వారు కూడా నమ్మరన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక విపత్కర పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ చేలిక శ్రీనివాస్, ఎంపీటీసీ కొండం శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఈటల భద్రయ్య, తుమ్మ శోభన్‌బాబు, కనుకుంట్ల అరవింద్, మౌటం సంపత్, కొలిపాక తిరుపతి, పుల్ల శోభన్, పిల్లి సతీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతులు త్వరగా పరిష్కరించండి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: ప్రజావాణిలో వచ్చిన వినతి పత్రాలను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అలసత్వం వహించకుండా ప్రజావాణి వినతిపత్రాలపై వెనువెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణికి మొత్తం 72 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లావైద్య ఆరోగ్య అధికారి సాంబశివరావు,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవిలత, మార్కెటింగ్ అధికారి సురేఖ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమలాపూర్ మండలం శంభునిపల్లి వద్ద రైతు తిరుపతిరెడ్డి దంపతులతో మాట్లాడుతున్న భట్టి



కాంగ్రెస్ హయాంలో సంచి నిండా సరుకులు

- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి హసన్‌పర్తిలో జరిగిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. - కమలాపూర్/ఎల్కతుర్తి - 8లో▸

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

- మకర, చంద్రప్రభ వాహనంపై భద్రకాళి ఉత్సవ విగ్రహ ఊరేగింపు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి భద్రకాళీభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, వేద పండితులు ఉదయం 5 గంటల నుంచి నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించారు. అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని మకర వాహనంపై ఊరేగించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ముదిరాజ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, ఉమ్మడి జిల్లాలకు చెందిన ముదిరాజ్ కార్పొరేటర్లు, నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు దేవాలయంలో జరిగిన భద్రకాళీభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవంలో భక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. జైభద్రకాళి అంటూ జయజయధ్వానాలు చేశారు. ఉత్సవ మూర్తిని చంద్రప్రభ వాహనంపై మంగళవాయిద్యాలతో ఊరేగించారు. సాయంత్రం పూజలకు మేరు వెల్ఫేర్ అసోసియేషన్ ఉభయదాతలుగా వ్యవహరించారు. పోడిశెట్టి అనిల్‌కుమార్, మేరు కులస్తులు పాల్గొన్నారు

నేడు కల్యాణం

మంగళవారం రాత్రి 7గంటలకు భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భక్తులంతా కుటుంబ సభ్యులతో పాల్గొనాలని, యాజమాన్యం వహిస్తూ పాల్గొనేవారు రూ.516 చెల్లించి రశీదు తీసుకోవాలని వారికి కల్యాణోత్సవ తలంబ్రాలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేయనున్నట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.



మకర వాహనంపై అమ్మవారు



ఎదుర్కోలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రాణం పోతే కానీ స్పందించరా?

నడికూడ: రోడ్డు కుంగింది. ప్రమాదం పొంచి ఉంది. కొత్తవాళ్లెవరైనా ఈ దారిమీదుగా ప్రయాణించినా, భారీ వాహనమేదైనా వచ్చినా ప్రమాదం జరిగే ఆస్కారం ఎక్కువ. మండలంలోని చౌటుపర్తి నుంచి చర్లపల్లి వరకు ఇటీవల తారు రోడ్డు పోశారు. చౌటుపర్తి గ్రామ శివారులోని యాపకుంట చెరువు కట్టపై ఉన్న రోడ్డుకు ఎడమ పక్కన ఉన్న వ్యవసాయ బావి వద్ద ఇటీవల కురిసిన వర్షాల వల్ల రోడ్డు కుంగిపోయింది. సుమారు 10 అడుగుల కోత ఏర్పడింది. భారీ వాహనాలేవైనా వస్తే రోడ్డు పూర్తిగా కుంగిపోయే అవకాశం ఉంది. రాత్రి సమయంలో వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా.. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సైడ్‌గార్డ్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా కుంగిన రోడ్డు

పోగొట్టుకున్న ఫోన్‌ల అందజేత

- సీఈఐఆర్ పోర్టల్‌తో గంట వ్యవధిలో దొరకబట్టిన పోలీసులు

పరకాల: పరకాల పట్టణానికి చెందిన ఓంటేరు రవి, వి.నాగరాజు సెల్‌ఫోన్‌లు సోమవారం పోయాయి. వరంగల్ సీపీ రంగనాథ్ ప్రకటనను చూసిన ఆయువకులు సీఈఐఆర్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమాచారంతో పరకాల పోలీసులు గంట వ్యవధిలోనే ఇద్దరి ఫోన్‌లను స్వాధీనం చేసుకొని పరకాల ఏసీపీ జే.శివరామయ్య చేతుల మీదుగా బాధితులకు అందించారు. ఈసందర్భంగా ఏసీపీ శివరామయ్య మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే తక్షణమే సీఈఐఆర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేసిన పరకాల సీఐ పుల్యాల కిషన్, ఎస్‌ఐ ప్రశాంత్ బాబు, శివకృష్ణ, కానిస్టేబుల్ రాజ్‌కుమార్, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.



పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అందిస్తున్న ఏసీపీ శివరామయ్య, సీఐ కిషన్, ఎస్సై ప్రశాంత్

అత్యుత్తమ పాఠశాలగా 'ప్రాక్టీసింగ్'

- అంకితభావంతో పనిచేస్తున్న హెచ్‌ఎం, టీచర్లు
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాల రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం ఆ పాఠశాలలో ఏర్పాటుచేసిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులుగా పిల్లల్ని జాగ్రత్తగా చదువుకునేలా ప్రోత్సహిస్తే విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతిలోకి వస్తారన్నారు. ముందుగా ఒకటో తరగతి నుంచి ఐదో తరగతికి చెందిన పలువురు విద్యార్థులతో ఆమె మాట్లాడించారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభ చూపిన పదిమంది విద్యార్థులకు డిక్షనరీలు అందించారు. అనంతరం విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ప్రగతిపత్రాలను అందించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం ఉప్పలయ్య, ఇతర ఉపాధ్యాయులను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. సమావేశంలో జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కో-ఆర్డినేటర్ బి.రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

క్లుప్తంగా

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి మే 4 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు టైంటేబుల్ ప్రకారం రోజు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2-30 నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షలు ఉదయం , మధ్యాహ్నం ఉంటాయి. అలాగే ఇంటర్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఉంటాయి. సబ్జెక్టుల ప్రకారం ఏ సమయంలో ఉంటే ఆ సమయంలో పరీక్షలకు హాజరవుతారు. నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ. అబ్దుల్‌హై , ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు సోమవారం తెలి పారు. ఇంటర్‌లో ఆరు జిల్లాలు కలిపి 4,518 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. టెన్త్ పరీక్షలకు 2,567 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు.

ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలు

ములుగు రూరల్(గోవిందరావుపేట): ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ ములుగు అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి మాధవి సోమవారం తీర్పునిచ్చారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన యువతి, అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో యువతి చదువు పూర్తయిన తర్వాత వివాహం చేసుకుంటానని ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో తన చెల్లితో శ్రీకాంత్ మాట్లాడడాన్ని గమనించిన అక్క మందలించింది. మనసులో పెట్టుకున్న శ్రీకాంత్ మరుసటి రోజు యువతి ఇంటికి చేరుకొని నీవు చనిపోతే సమస్యలు పరిష్కారమవుతాయని గట్టిగా అనడంతో మనస్తాపానికి గురైన యువతి ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి తల్లి ఈక సరోజన 2018 డిసెంబర్ 09న అప్పటి ఎస్సై మహేందర్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. సోమవారం ఏపీపీ సత్యనారాయణ వాదనలతో ఏకీభవించిన అసిస్టెంట్, సెషన్ కోర్టు జడ్జి మాధవి శ్రీకాంత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది.



కాంగ్రెస్ హయాంలో సంచినిండా సరుకులు

- బీజేపీ పాలనలో మాయం
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క
- కాకతీయ యూనివర్సిటీలో రాత్రి బస

కమలాపూర్/ఎల్కతుర్తి: కాంగ్రెస్ హయాంలో రేషన్ షాపుల్లో నిరుపేదలకు సంచినిండా సరుకులిస్తే, బీజేపీ ప్రభుత్వంలో అవన్నీ మాయమయ్యాయని సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి యూనివర్సిటీలో బస చేశారు. ముందుగా కానిపర్తిలో వరి కోతలు కోస్తున్న మహిళా కూలీలు రజిత, సరోజనలతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. శంభునిపల్లి బ్రిడ్జిపై వరి ధాన్యం ఆరబోసిన మోడెం సంధ్యారాణితో మాట్లాడారు. వడ్లు బాగా ఎండితేనే కొంటామని కొనుగోలు కేంద్రాల్లో చెబుతున్నారని, ఇటీవల కురిసిన అకాల వర్షానికి 250 బస్తాల వడ్లన్నీ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళా రైతుకు చేయూతగా ఆమె ఆరబోసిన వరి ధాన్యాన్ని కాసేపు భట్టి తిరగేశారు. శంభునిపల్లికి చెందిన రైతు కట్కూరి తిరుపతిరెడ్డితో మాట్లాడారు. కానిపర్తి శివారులోకి చేరుకోగానే ఓ గీత కార్మికుడు తెచ్చిన ముంజలను భట్టితోపాటు నాయకులు ఆరగించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క, గౌడన్నల మోకు, ముత్తాదు ధరించి గీత కార్మికుడు స్వామిని శాలువాతో సన్మానించారు.


కమలాపూర్ : శంభునిపల్లి వద్ద వరి ధాన్యం తిరగబోస్తున్న భట్టి విక్రమార్క


ఎల్కతుర్తి మండలం బావుపేటకు చేరుకున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భట్టివిక్రమార్క

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తి మండలం గుంటూర్‌పల్లి వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. బావుపేట గ్రామంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. బీసీ సబ్‌ప్లాన్ తీసుకువస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన గాలివానకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఫకృద్దీన్, చరణ్‌పటేల్, బాలసాని రమేష్‌గౌడ్, నాయకులు మేడిపల్లి సత్యం, తొటం రవీందర్, అయిలయ్య, పోడేటి భిక్షపతి, కనుకరత్నం, సముద్రాల కృష్ణ, సాంబయ్య, వెంకట్, నీలిమా, అన్వేష్‌రెడ్డి, సుకినె సంతాజీ, ఇంద్రసేనారెడ్డి, దాట్ల రాముడు, మాల్లారెడ్డి, ముప్పు మహేందర్, మండ సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ సంపదను దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబం

హన్మకొండ చౌరస్తా: బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి కేసీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదను దోచుకుంటుందని సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. హసన్‌పర్తి వద్ద ఏర్పాటు చేసిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎక్కడా డబుల్‌బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకే పంపిణీ చేస్తామని, అమ్మహస్తం పథకం పునరుద్ధరించి రేషన్ దుకాణాల ద్వారా 9 సరుకులు పంపిణీ చేస్తామన్నారు.

వైద్య విద్యార్థుల బయోమెట్రిక్ షురూ

- రెండే పరికరాల ఏర్పాటుతో గందరగోళం
- హాజరు శాతం నమోదు చేసేందుకు ఇబ్బందులు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న అన్ని బోధనాస్పత్రుల్లో సోమవారం నుంచి బయోమెట్రిక్ హాజరుశాతాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. క్లినికల్ సేవలందిస్తున్న వైద్య విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపర్చడం, వారిపై ప్రత్యేక దృష్టి సారించేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వం కేఎంసీని ఎంచుకుంది. ఈక్రమంలో వందలాది మంది విద్యార్థులు హాజరయ్యే ఎంజీఎంలో రెండే పరికరాలను ఏర్పాటు చేయడం గందరగోళానికి దారి తీసింది. ఉదయం 9 గంటలకు ప్రతీ విద్యార్థి తమ బయోమెట్రిక్ హాజరు వేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎంజీఎం ఆర్ఎంఓ కార్యాలయాలనికి ఎదురుగా ఉన్న గదిలో బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేశారు. హాజరు నమోదు చేసుకోవడానికి వచ్చిన వైద్య విద్యార్థులకు బయోమెట్రిక్ ఎక్కడుందో తెలియక కొద్దిసేపు ఇబ్బంది పడగా.. పరికరాలు ఏర్పాటు చేసిన గదికి తాళం వేసి ఉన్న విషయాన్ని గుర్తించారు. ఈ గది తాళం 10 గంటల వరకు తెరవకపోవడంతో వందలాది మంది విద్యార్థుల హాజరు శాతం నమోదు చేసేందుకు పరిపాలనా కార్యాలయం వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే.. కొందరు విద్యార్థులను బయోమెట్రిక్ పరికరం గుర్తించలేదు. ఈ విషయంపై ఎంజీఎం పరిపాలన అధికారులను వివరణ కోరగా.. లోపాలను సరి చేసి విద్యార్థులకు అనుకూలంగా బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేసారు.


నమోదు చేసేందుకు గుమిగూడిన వైద్య విద్యార్థులు

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు
- నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్, టౌన్ పోలీసులు గత కొన్ని రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం పక్కా సమాచారంతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నలుగురి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. బెట్టింగ్‌లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏలూరు జిల్లాకు చెందిన వలగాని రామకృష్ణ, ఖమ్మం వాసి తొట్టింపూడి విక్రమ్, చార ప్రవీణ్ కుమార్, గుంటూరుకు చెందిన ఆనంద్ కిరణ్ కలిసి మహబూబాబాద్ పట్టణంలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. యువత బెట్టింగ్‌ను ప్రోత్సహించే విధంగా ప్రచారం చేస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు బుకీలుగా వ్యవహరిస్తూ చైన్ లింకింగ్ సిస్టం ద్వారా బెట్టింగ్ ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, తెలంగాణలోని మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో వీరు బెట్టింగ్ టీంలను ఏర్పాటు చేశారన్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌లో బెట్టింగ్‌లు వాళ్లకు నచ్చిన జట్టు మీద బెట్టింగ్ కాసి వలగాని రామకృష్ణ వీరు చెప్పిన జట్టు మీద ఎంత డబ్బులు బెట్టు పెట్టారో నోట్‌బుక్ లో నోట్ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెట్టింగ్‌కు సంబంధించిన నగదును ఆన్‌లైన్ ద్వారా ముందుగానే తీసుకోవడం, మ్యాచ్ అనంతరం గెలిచిన వారికి నగదును ఆన్‌లైన్ ద్వారానే బదిలీ చేయడం జరుగుతుందని తెలిపారు. గత కొంతకాలంగా మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో విక్రమ్, ప్రవీణ్ కుమార్, ఆనంద్ కిరణ్ బెట్టింగ్ చేస్తూ, బెట్టింగ్‌ను ప్రోత్సహించడం చేస్తున్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారిలో వలగాని రామకృష్ణ, తొట్టింపూడి విక్రమ్, ఆనంద్ కిరణ్, దార ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని మహబూబాబాద్ పోలీసులకు వాట్సాప్ నంబర్ 8712656999లో తెలియజేయాలన్నారు. సమాచారం సేకరించి నేరస్తులను పట్టుకున్న మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సంతోష్, రమేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, రామకృష్ణ, దిలీప్, వీరస్వామిలను జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించి, రివార్డులు అందజేశారు.


వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

- 24 గంటల్లో నిందితుడి పట్టివేత
- పోలీసులకు ఏసీపీ శ్రీనివాస్ అభినందన

కాజీపేట: ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన నిందితుడిని 24 గంటల్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 63వ డివిజన్ విష్ణుపురి కాలనీకి చెందిన ములుగు దేవేంద్ర ఈ నెల 22న ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపక్కనే ఉండే యాదగిరి సురేష్ గొలుసు అపహరించి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా సురేష్‌పై అనుమానం వేసి విచారించగా నేరం చేసినట్లుగా అంగీకరించి గొలుసును అప్పగించాడన్నారు. చోరీ జరిగిన వెంటనే స్పందించి నిందితుడిని గుర్తించిన సీఐ సార్ల రాజు, ఎస్సై ప్రమోద్‌కుమార్, క్రైం కానిస్టేబుల్ బి.భాస్కర్, కమలాకర్‌లను ఏసీపీ అభినందించారు. త్వరలో సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్సైలు మాచర్ల శ్వేత, ప్రమోద్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ శ్రీనివాస్

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రామన్నపేట : రాత్రి సమయంలో నగరంలో పార్క్ చేసిన వాహనాలను దొంగిలిస్తున్న దొంగను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రతిరాంతండాకు చెందిన గుగులోత్ నవీన్ తొర్రూర్‌లో ఒక కాలేజీలో చదువుతున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయడం ప్రారంభించాడన్నారు. ఇలా రాత్రి సమయంలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను కీ లేకుండా స్టార్ట్ చేసి తీసుకెళ్లి వాటన్నింటిని ఒకేసారి అమ్మాలని వరంగల్ రైల్వేస్టేషన్ పార్కింగ్ ఏరియాలో దాచిపెట్టేవాడని తెలిపారు. ఇలా అమ్మడానికి ఇద్దరిని సంప్రదించి బేరం కుదుర్చుకున్నాడని ఏసీపీ తెలిపారు. సోమవారం ఇంతేజార్‌గంజ్ పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో అనుమానంగా కనిపించిన నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ మల్లేష్, ఎస్సై నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శివ, ఉపేందర్, రాజశేఖర్, ఏఎఓ సల్మాన్‌లను ఏసీపీ అభినందించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

ఆరుగురు కూలీలకు గాయాలు

దంతాలపల్లి: ఆటో వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఆరుగురు కూలీలకు గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, క్షతగాత్రుల కథనం ప్రకారం ..తొర్రూరు మండలం చింతలపల్లికి చెందిన రాజబోయిన దూడాలు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దినచర్యలో భాగంగా అదే గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు ఆటోను అద్దెకు తీసుకొని మరిపెడ మండలం వీరారం గ్రామ సమీపంలో మిరుపకాయలు ఏరటానికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన తాళ్ల యాకయ్య తన బైక్‌తో వ్యక్తిగత పనిపై దంతాలపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి కూలీలతో ఆటో వస్తుంది. ఈ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న ఇన్నోవా వాహనం తప్పించబోయి వాహనదారుడు రోడ్డు పైకి రావడంతో వెనుక నుంచి వచ్చి ఆటో ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. కె రాధిక, నాగులబోయిన గంగ, ఏర్పుల సోమలక్ష్మి, కొండూరి పిచ్చమ్మ, కొండూరి పద్మ, కమటం సామ్రజమ్మలకు గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై కూచిపుడి జగదీష్ 108 వాహనంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సైని అడుగగా ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

మహబూబాబాద్ డీడీకి పుత్రశోకం

- గుండెపోటుతో తనయుడి మృతి


ప్రదీప్‌కిరణ్ కుమార్ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరు నాగారం: ఐటీడీఏ పరిధిలోని మహబూబాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మంకిడి ఎర్రయ్యకు పుత్రశోకం మిగిలింది. మంకిడి ప్రదీప్‌కిరణ్‌కుమార్(31) ఆదివారం రాత్రి అకాల మరణం చెందాడు. హనుమకొండలోని గోపాలపురంలో ఎర్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆది వారం రాత్రి కుమారుడు ప్రదీప్‌కు ఛాతిలో నొప్పి వస్తుందని కుప్పకూలిపోయాడు. సీపీఆర్ చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ప్రదీప్ ఇంట్లోనే ఉండి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ప్రదీప్‌తోపాటు మరో కుమారుడు, కుమార్తె ఉంది. చేతికి అందిన పెద్ద కుమారుడు మృతి చెందడంతో ఎర్రయ్య కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.


పరామర్శిస్తున్న కలెక్టర్ శశాంక, పీఓ అంకిత్

నర్సాపూర్‌లో అంత్యక్రియలు


మహబూబాబాద్ డీడీ మంకిడి ఎర్రయ్య కుమారుడు ప్రదీప్‌కిరణ్‌కుమార్ మృతి చెందగా ఆయన స్వగ్రామమైన తాడ్వాయి మండలం నర్సాపూర్ (పీఏ) గ్రామానికి సోమవారం ఉదయం తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు కృష్ణ ఆదిత్య, శశాంక, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్‌లు భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే జెడ్పీ వైస్‌చైర్మన్ బడే నాగజ్యోతి, డీఎంహెచ్ఓ అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, ఐటీడీఏ ఉద్యోగులు తరలివచ్చి పరామర్శించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


వెంకన్న (ఫైల్)

కురవి : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం సీరోలు మండలం చింతపల్లి శివారు భూక్యతండాలో చోటు చేసుకుందని సీరోలు ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..భూక్య తండాకు చెందిన మాజీ సర్పంచ్ సాంక్రియా నాయక్ పెద్దకుమారుడు భూక్య వెంకన్న(45) కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన వివరించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తండాకు చేరుకుని సాంక్రియానాయక్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, ఎంపీటీసీ బోజ్యానాయక్, మాజీ ఎంపీటీసీ చందూలాల్, మాజీ సొసైటీ చైర్మన్ బీకోజీనాయక్, నాయకులు మామిళ్ల వెంకన్న, బాలాజీ, నరహరి, ఉపసర్పంచ్ జేరిపోతుల రంగన్నగౌడ్, దేవ్‌సింగ్, పత్తిసింగ్ ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి... శవమై కనిపించాడు


సాయిలు (ఫైల్)

కేసముద్రం: ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ వ్యక్తి..చెరువులో శవమై కనిపించిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన కొమ్మనబోయిన సాయిలు(48) ఓ రైతు వద్ద జీతం ఉన్నాడు. అయితే బావిలో మునిగిన విద్యుత్ మోటార్లను తీసే గజ ఈతగాడిగా సాయిలుకు మంచి పేరుంది. ఈనెల 21న భార్య నాగమ్మ పనికి వెళ్లగా, ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇనుగుర్తి గ్రామశివారు గుంటి చెరువులో మత్తడివైపునకు సాయిలు మృతదేహం తేలి ఉండగా అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు చెరువువద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని, మృతదేహన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయిలు చెరువులో శవమై కనిపించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చివరి రోజు సరుకులు మాయం

గూడూరు: వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాఠశాలలో మిగిలిన సరుకులను ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది తీసుకెళ్తూ గ్రామస్తులకు పట్టుబడిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెసవి సెలవుల దృష్ట్యా మంగళవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో ఆశ్రమంలో మిగిలిన సరుకులను గుర్తించి రిజిస్టర్‌లో రాసి వెళ్లాలి. కానీ ఈ పాఠశాలలో మాత్రం అందులో పనిచేసిన సిబ్బంది ప్రిన్సిపాల్‌తో, తిరిగి పాఠశాల ప్రారంభమయ్యే వరకు మిగిలిన సరుకులు పురుగులు పట్టి పాడవుతాయి. మిగిలిన పప్పులు పని చేసిన తమకు అరకిలో చొప్పున ఇవ్వమన్నారు. దీంతో ప్రిన్సిపాల్ వసంత మిగిలిన 5 కేజీల పప్పును సిబ్బందికి ఇచ్చింది. మిగతా సరుకులను తమ బ్యాగ్‌లో పెట్టుకొని పాఠశాలకు తాళం వేసి బయలుదేరారు. ఈ దృశ్యాన్ని ముందుగా తెలుసుకున్న గ్రామస్తులు గేటు ఎదురుగా ఉండి వీడియో తీయడం గుర్తించిన ప్రిన్సిపాల్ సరుకులను వదిలేసి వెళ్లింది. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ వసంతను వివరణ కోరగా సిబ్బంది అడిగితే ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది తీసుకెళ్లిన సరుకులను తిరిగి సేకరిస్తానని సమాధానమిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్స్

- విద్యార్థులకు ప్రగతిపత్రాల అందజేత
- నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో చివరి పనిదినం సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించారు. ఈసమావేశంలో విద్యార్థుల అకాడమిక్ సామర్థ్యాల సాధనపై తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపారు. ఇటీవల ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించారు. అందులో వచ్చిన మార్కుల ప్రగతిపత్రాలను ఆన్‌లైన్‌లోనూ సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ క్యూమిలేటివ్ ప్రగతి పత్రాలను ప్రతీ పాఠశాలలోనూ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అందించారు. కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు కొంతమేర హాజరు కాగా.. మరికొన్ని పాఠశాలల్లో అంతంత మాత్రంగానే.. హాజరైనట్లు సమాచారం. పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ప్రగతిపత్రాలు అందించారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు హెచ్ఎంలు పలు సూచనలు చేశారు. సోమవారంతో ఈవిద్యా సంవత్సరం ముగిసింది. ఈనెల 25 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు. మళ్లీ పాఠశాలలు జూన్ 12న రీ ఓపెన్ చేస్తారు. అయితే జూన్ ఒకటి నుంచి బడిబాట ఉండే అవకాశం ఉండే అవకాశం ఉంది.


నారాయణగిరి స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం

ప్రభుత్వ విద్యకు పెద్దపీట

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

కాశీబుగ్గ సెంటర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తుందని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మన బస్తీ, మన బడి అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మట్టెవాడ ప్రాథమిక పాఠశాలలో రూ. 19.79లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను డీఈఓ వాసంతితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మన బస్తీ, మన బడి కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ తేజస్వీ శిరీష్, స్పెషల్ ఆఫీసర్ నరసింహ మూర్తి, ఆర్‌అండ్ బీ డీఈ కె.జితేందర్ రెడ్డి, ఈఈ పి.రాజు, ఏఈ అనిల్, ఎస్ఎంసీ చైర్మన్ పి.సతీష్‌కుమార్, హెచ్ఎం సులోచన తదితరులు పాల్గొన్నారు. కాగా జీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థి, మన ఊరు, మన బడి ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ నరసింహ మూర్తి పాఠశాలకు రూ.25వేలను విరాళంగా అందించారు.


ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి, డీఈఓ వాసంతి

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని డీఈఓ వాసంతి కోరారు. సోమవారం పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశాలు (పీటీఎం) జిల్లా వ్యాప్తంగా నిర్వహించగా మట్టెవాడ జీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన పీటీఎంకు డీఈఓ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులను అందజేస్తుందన్నారు. కాగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని తల్లిదండ్రులు డీఈఓ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వ నిబంధనల మేరకు సర్దుబాటు చేస్తామన్నారు.